
# మినీ కథ

## కసి



దీక్షగా తనపని చేసుకుపోతున్నాడు సీనియర్ టెక్నీషియన్ వరహాలరావు - మైక్రోబయాలజీ లేబరేటరీలో.

రకరకాల వ్యాధులకు సంబంధించిన "శాంపుల్స్" రోగులనుండి తీసినవి మెడికల్ వార్డులనుండి ఆ లేబరేటరీకి పంపిబడతాయి.

వాటిలో రకరకాలుంటాయి. కొన్ని వెన్నుపామునుండి తీయబడిన, మెదడుకు సంబంధించిన సి. యస్. యఫ్ ఫ్లూయిడ్లూ, మలం, మూత్రం, కఫం అన్నిటికీ ప్రాపర్ లేబుల్‌తో లాబ్‌కు పంపుతారు పరీక్షకోసం.

మైక్రో బయాలజీలాబ్ సర్వరోగకారక క్రిములకు గోడౌన్‌లాంటిది.

ఇక్కడ సూపర్‌వైజ్ చేసే డిపార్ట్‌మెంట్ ఛీఫ్ నుండి, టెక్నీషియన్ వరకూ చాలా జాగ్రత్తగా ఉంటారు శాంపుల్స్ హాండిల్ చేసే విషయంలో.

ఏమాత్రం అనుమానం వచ్చినా ఏంటిసెప్టిక్ లిక్విడ్ ఉన్న వాష్‌బేసిన్‌లో చేతులు శుభ్రపరచుకుంటారు తక్షణం!

ఇలా లాబ్‌కు చేరిన శాంపుల్స్‌ను "కల్చర్" చేస్తారు.

కల్చర్ అనేది చాల తమాషా ప్రక్రియ. "పెట్రీడిష్‌లు" అనబడే పలుచగా ఉండే గాజు భరిణలలాంటి వాటిలో ఆయా క్రిములకు సంబంధించిన ఆహారాలతో కూడినపదార్థం (మీడియం) నిర్దిష్టమైన రంగు కలపబడి ఉంటుంది. అది చూడడానికి గోధుమ హల్వాలా ఉంటుంది.

ఒక "వైర్ లూప్"తో "శాంపుల్స్"లో వచ్చిన పదార్థాన్ని "పెట్రీడిష్"లో ఉన్న "మీడియం"పై రాస్తారు. తరువాత ఆ డిష్‌లను "ఇంక్యుబేటర్"లో ఓ రాత్రంతా ఉంచుతారు. దానిలో రోగక్రిములు వృద్ధి పొందడానికి కావలసిన 38 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత మెయిన్‌టెయిన్ చేయబడుతుంది ఆటోమాటిక్‌గా.

"నిన్న నీకు ప్రత్యేకంగా ఒక శాంపుల్‌ని "సెన్సిటివిటీ" పెట్టమన్నాను కదా".

"యస్ సార్!" అంటూ ఒక డిష్ అందించాడు ఇంక్యుబేటర్‌లోనుండి తీసి.

ఛీఫ్ మూత తెరిచి నీలిరంగు మీడియంవైపు పరిశీలనగా చూస్తూ "గుడ్ గాడ్! ది బాక్టీరియా ఈజ్ వెరీ రెసిస్టెంట్ టు వర్డ్స్ ఆల్ ది డ్రగ్ డిస్క్స్ ఉయ్ హావ యూజ్డ్" నిట్టూర్చాడు.

"ఎనీ హౌ క్విక్.... అర్జంట్‌గా రిపోర్ట్ తయారుచెయ్యి. పేషెంట్ మంత్రిగారికి దగ్గర బంధువు, ఫారిన్‌నించైనా "ఆంటిబయాటిక్" తెప్పించుకోగలడు."

మరుక్షణం రిపోర్టు తయారుచేసి ఛీఫ్‌కి అందించాడు. చకచకా సంతకం గీకాడాయన.

తననే వెళ్ళి రిపోర్టు పర్సనల్‌గా స్పెషల్ వార్డు ఇన్చార్జ్‌కి హాండోవర్ చేయమన్నందున పరుగులాంటి నడకతో బయటకి నడిచాడు హడావిడిగా.

* * * *

వరహాలరావు భార్య సుమతికూడా అదే లాబ్‌లో పనిచేస్తున్నది.

ఆరోజు రాత్రి భోజనం ముగించారు భార్యాభర్తలు. అలవాటుప్రకారం ఫ్రిజ్‌లోనుంచి ఐస్‌క్రీం తీసి తనకో ప్లేట్ ఇచ్చి తనోటి అందుకుంది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తినడం ప్రారంభించారు.

వేసవి వచ్చిందంటే చాలు ఆరు నూరైనా నూరు ఆరైనా రాత్రి భోజనం కాగానే ఐస్‌క్రీం తినాల్సిందే అది తన భార్య చిత్రమైన అలవాటు.

ఐస్‌క్రీం తనే స్వయంగా తయారు చేస్తుంది ఆ రుచి ఏ షాప్‌లో తిన్నా రాలేదనిపిస్తుంది వరహాలరావుకి.

"ఏవండీ మీకో శుభవార్త" అన్నది సిగ్గుతో ముగ్గౌతు.

"ఏవిటోయ్ అది" ఉత్సాహంగా అడిగాడు.

"అదేనండి. మీరు.... మీరు.... తండ్రి కాబోతున్నారు."

ప్రక్కలో బాంబ్ పేలినట్టు ఉలిక్కిపడ్డాడు తన భార్య మాటలకి, కాసేపు దిక్కుతోచలేదు అతనికి.

"అదేమిటండి అలా బిగుసుకుపోయారు?"

"అదేనోయ్! అదే.... ఆనందం పట్టలేక ఉక్కిరి బిక్కిరి అయి...." అన్నాడు తన రియాక్షన్‌ని కప్పిపుచ్చుకుంటూ.

* * * *

రాత్రి ఒంటిగంట కావస్తోంది. తనప్రక్కన ప్రశాంతంగా నిద్రపోతోంది సుమతి.

కంటిమీద కునుకు రావడంలేదు వరహాలరావుకి. ఆనందించాల్సిన విషయం తనకి హాలాహలంగా మారింది.

తన చేతిలోపనే కదా అని మూణ్ణెల్లక్రితం తన "వీర్యాన్ని" పరీక్షించుకున్నాడు మైక్రోస్కోప్‌లో. ఆ దృశ్యాన్నిచూచి హతాశుడయ్యాడు.

పదేపదే "ఫీల్డ్" మార్చి మార్చి చూశాడు. ఫలితం శూన్యం. గాలించి చూచినా ఒక్క వీర్యకణం కూడ కనిపించలేదు.

తను మరో జీవిని సృష్టించడానికి అనర్హుడు. తనలో తనే చాలారోజులుగా మధనపడు

# మినీ కథ



తున్నాడు తన భార్యకు ఎలా చెప్పాలా అని.

పిలలకోసం కలవరించే తన భార్య ఇది విని తట్టుకోగలదా ?

సుమతికి ఈ విషయం చెప్పకుండానే నెట్టుకు వస్తున్నాడు ఈరోజువరకూ.

తన భార్య కులట. ఇది తను జీర్ణించుకోలేని చేదునిజం. తనముందు చాలా అమాయకంగా నటిస్తూ ఎవడితోనో కులుకుతోంది.

తన భార్యకు ఏ విటుడిద్వారానో కలిగిన కొడుకుకు తను తండ్రి "పోర్ట్‌ఫోలియో" తీసుకోవాలా ?

కోపం, దుఃఖం ఒకేసారి పొంగాయి. చవటలా తనెందుకు బ్రతకాలి ?

మర్నాడు తప్పనిసరైన డ్యూటీకి హాజరైనాడు వరహాలరావు.

ఎలాగో ఛీఫ్‌ని వారంరోజుల లీవ్‌కోసం ఒప్పించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది అతనికి.

తను దూరంగా ఉన్న తన అమ్మను ఓసారి చూడాలనిపించిందని తన భార్య సుమతికిచెప్పి సాయంత్రం 6 30 గంటలకు ఇంటినుండి బయలుదేరాడు రైల్వేస్టేషనుకి.

తిన్నగా, తను స్వగ్రామం రామాపురం చేరాడు మర్నాడుసాయంకాలం 4-00 గంటలకి.

ఆ పల్లెటూరు చేరాలంటే రెండుమైళ్ళ కాలి నడకొ తప్పదు తనకు.

హటాత్తుగా ఊడిపడ్డ కొడుకునిచూచి ఆనంద పడిపోయింది ఆ ముసలిప్రాణం.

వరహాలరావు తమతో వచ్చి సిటీలో ఉండి పొమ్మని ఎప్పుడడిగినా "ఒరేయ్ మీ నాన్న పోయిన ఈ గడ్డనే నేనూ కడతేరాలిరా" అంటుంది అతని తల్లి.

చూస్తుండగానే రెండ్రోజులు గడిచిపోయాయి. తనలోని బాధను తన తల్లిదగ్గర బహిర్గతం కానీయలేదు.

"టెలిగ్రాం సార్" పోస్టల్ కుర్రాడు నిలబడ్డాడు తమ ఇంటిముందు.

అందుకుని ఆదుర్దాగా చూశాడు వరహాలరావు.

"సుమతి అడ్మిటెడ్ హాస్పిటల్ వెరీ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియేట్లీ" తమ హాస్పిటల్ కొలీగ్ ఒకడిచ్చాడు ఆ టెలిగ్రాం.

అది ఆ కుగ్రామం చేరడానికి రెండురోజులు పట్టింది.

తక్షణం బయలుదేరాడు విషయం తన అమ్మకు తెలియజేసి.

సాయంత్రం 3-00 గంటలైతే రైలుస్టేషన్ చేరేసరికి, నేరుగా హాస్పిటల్‌కే వెళ్ళాడు ఆటోలో.

ఎదురుచూస్తున్న తన కొలీగ్స్ తనను ఓ బెడ్‌వద్దకి తీసుకెళ్ళారు మౌనంగా.

బెడ్‌పై తన భార్య నిర్జీవంగా పడివుంది.

అక్కడవున్న డ్యూటీ డాక్టర్ "సారీ వరహాలరావ్ కేస్ చాలా కాంప్లికేటెడ్‌గా తయారైంది. దిస్ ఈజ్ ఎ మిక్స్‌డ్ ఇన్ఫెక్షన్. నా శాయశక్తులా ప్రయత్నం చేశాను. ఫలితం లేకపోయింది" అని నిట్టూర్చాడు.

"సుమతీ !" పెద్దగా రోదిస్తూ ఆమె భౌతిక కాయంమీద పడి వలవలా ఏడ్చాడు వరహాలరావు.

ప్రక్కనున్నవారి కళ్ళు చమర్చాయి ఆ దృశ్యం చూసి.

* * * *

గడ్డం బాగా పెరిగి చింపిరిగా తయారైంది వరహాలరావుకి.

ఒక్కసారి నవ్వుకున్నాడు తనలో తాను. గతం ఫిల్మ్‌రీలులా తన స్మృతిపథంలో కదులుతోంది.

ఆరోజు తను సెలవు రాసి ఇచ్చి లాబ్‌నుండి, సాధారణ మందులకు లొంగని కొన్నిరకాల వ్యాధిక్రిములని ఓ చిన్న సీసాలో కలెక్ట్‌చేసి భద్రంగా ఇంటికి చేర్చాడు.

తన భార్య సుమతి ఏదో ఇంటిపని ధ్యాసలో ఉండగా, తిన్నగా ఫ్రిజ్ తెరిచి, జాగ్రత్తగా ఐస్‌క్రీంలో కలిపాడు క్రిములని.

అంతే.... తను వెళ్ళిన ఆరాత్రే ఐస్‌క్రీం తిని ఉంటుంది. రకరకాల వ్యాధిక్రిములు ఒక్కసారిగా ఆటాక్ చేయడంతో పైలోకాలకి చేరింది రాక్షసి. వ్యంగ్యంగా, కర్కశంగా నోరారా నవ్వుకున్నాడు.

యస్ తను చేసింది ఘోరమైన "బాక్టీరియల్ మర్డర్ !" నరమానవుడెవ్వరూ అనుమానించలేరు. అనుమానించినా లీగల్ ఎవిడెన్స్ చచ్చినా దొరకదు.

ఆలోచనల దొంతరనుండి బయటపడిన వరహాలరావు, తను అప్పటికే తినడం పూర్తి చేసిన ఐస్‌క్రీం ప్లేటుని గమనించాడు.

అంతే.... పిచ్చిగా అరిచాడు. ఘోరం.... చాలా పెద్దఘోరం జరిగిపోయింది ! పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు.

తన భార్యకు ఎరగా ఉంచిన ఐస్‌క్రీంలో భాగం తనూ తిన్నాడు యదాలాపంగా, ఆలోచనారహితంగా.

పిచ్చికుక్కలా బాత్‌రూంలోకి పరుగుతీశాడు బలవంతంగా తిన్నదంతా కక్కాడు. గొంతులో మంట బయలుదేరింది.

అతని ముఖంలో చావుకళ వచ్చేసింది. అప్పటికే అరగంటగడిచింది తను ఐస్‌క్రీంతిని.

అతనికి తెలుసు "బాక్టీరియా" తనను "ఆటాక్" చేయడానికి ఆ అరగంట చాలునని. అదీకాక తను కలిపిన వ్యాధిక్రిములలో భారత దేశంలో లభ్యమయ్యే ఏ మందుకూ లొంగని, మంత్రిగారి బంధువుకు సంబంధించిన క్రిములు కూడ చేరి ఉన్నాయనీ !

"తను తన భార్యను, ఆమెలో పెరుగుతున్న జీవాన్ని చాల నీచంగా చంపాడు. తనకెవడిచ్చారు ఒక నిండుప్రాణాన్ని చంపే అధికారం ?" అప్పుడు అనిపించింది అతనికి ! ?

"తప్పదు, చావు తప్పదు" గొణుక్కుంటున్నాడు తనలో తను వరహాలరావ్ !

– చావలి
చంద్రశేఖరశాస్త్రి
ఎనలిటికల్ ల్యాబ్
సింగరేణికాలరీస్
బెల్లంపల్లి – 504251
ఆదిలాబాద్(జిల్లా)